అడవులు పిలిచాయ్

శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

'చాలా సంవత్సరాల తర్వాత మనం తిరిగి కలుసుకోవటం నాకు చాలా సంతోషంగా వుంది. ఎప్పుడెప్పుడు నిన్ను కలుస్తానా అని ఎదురు చూస్తున్నాను. నీ కోసం స్టేషన్‌కి వస్తాను.' అని రాసింది రాజ్యం, నా ఉత్తరానికి సమాధానంగా.

ఆ ఉత్తరం చూసి నాకూ సంతోషం కలిగింది. ఎన్ని సంవత్సరాల్తరువాతా, మేం కలుసుకోవటం!? ఇప్పుడు రాజ్యం హైదరాబాద్‌లో ఇన్‌కంటాక్సు ఆఫీసర్‌గా పనిచేస్తూ వుంది. నేనూ, ఇండియాలో అన్ని వూళ్ళూ దాదాపు తిరిగినట్లే! చివరికి ఈనాటికి నాగపూర్ చేరుకున్నాను. నాన్నగారు ఎప్పటినుండో మధ్యప్రదేశ్‌లో భారీఎత్తున కంట్రాక్టులు చేస్తూ అక్కడే స్థిరపడినంత పనిచేసారు. ఏదో మా చదువుల నిమిత్తం కొన్ని సంవత్సరాలు మేము-నాన్నగారు తప్ప-హైదరాబాద్‌లో వున్నాము. మేము అంటే ముగ్గురమే. అన్నయ్యా నేనూ; మా కోసం మా అమ్మా! ఆ రోజుల్లో మా ఇంటి ప్రక్కన వుంటుండేవారు రాజ్యంవాళ్ళు. రాజ్యం స్కూల్లో, కాలేజీలోనూ నా క్లాసుమేట్. చాలా స్నేహంగా వుండేవాళ్ళం. వాళ్ళ నాన్నగారికి మంచి బిజినెస్ వుండేది. వాళ్ళ ఇంట్లో రెండు కార్లు ఉండేవి. లైట్ గ్రీన్ ఫియట్ వాళ్ళ నాన్నగారు వాడేవారు. మస్టర్డ్ కలర్ పద్మిని ఫియట్‌ని వాళ్ళ అన్నయ్య వాడుకునేవాడు; రాజ్యం అన్నయ్య పేరు రమేష్; ఒక్కడే కావటంవలన, అతన్ని ఇంట్లో అపురూపంగా చూసుకునేవారు!

గ్లాస్కో లాల్చీ వేసి తెల్లని పైజమాతో గిరజాల జుట్టుతో అందంగా సుకుమారంగా ఉండేవాడు రమేష్. తెల్లవారుఝామున వాళ్ళ ఇంట్లోనుండి 'ఫ్లూట్'మీద మధుర మధురమయిన సంగీతం వినవచ్చేది. రమేష్‌కి సంగీతంలో ప్రవేశం ఉంది. అతను కవిత్వం కూడా రాస్తాడని రాజ్యం చెప్పింది.

ఒకసారి అందంగా 'బైండ్' చేయబడిన పుస్తకం తెచ్చి ఇచ్చింది రాజ్యం. 'నీకు పుస్తకాలంటే ఇష్టం కదా. ఇది చూడు' అని నవ్వింది. నాకు సాహిత్యంమీదా, సంగీతంమీదా ఆ రోజుల్లో చాలా ఇష్టం వుండేది. ఆ పుస్తకం చదివాను. మళ్ళీ చదివాను! మళ్ళీ మళ్ళీ చదివాను!! అంత బాగుంది కవిత్వం! సున్నితమయిన భావనలు. ఉదాత్తమయిన వస్తువు. అందమయిన ప్రతీకలు. మనస్సుని పట్టి నడిపించే శైలీ విన్యాసం. మాతృమూర్తి తన బిడ్డని గురించి వెలిబుచ్చిన ఆలోచనాత్మకమయిన ఆలోచనా పరంపర. చిన్న చిన్న మాటలలో గొప్ప కవిత్వం!

'చాలా బాగుంది!' అన్నాను రాజ్యంతో, ఒకనాడు.

'కవి ఎవరనుకున్నావు?' అంది నవ్వుతూ రాజ్యం.

'ఎవరు?' అని అడిగాను; ఎవరో తెలిసినా కూడా ఆ అవకాశాన్ని రాజ్యానికి ఇవ్వాలని నా ముచ్చట.

'రమేష్ చౌదరి మా అన్నయ్య. అతనికి కవిగా మంచి పేరు ఉంది!' అంది, గర్వంగా, రాజ్యం.

'ఆ సంగతి నాకూ తెలుసు. అయితే అతనే ఇతనని ఇప్పుడు తెలిసింది. కంగ్రాట్స్' అన్నాను.

'థాంక్సు!' అంది. రాజ్యం చూపుల్లో గర్వం! కృతజ్ఞతలు కూడా.

'ఇది రమేష్ సుమారు ఏడెనిమిది సంవత్సరాల క్రిందట రాసినది! ఆ తర్వాత అతను రాసిన కవిత్వం మరో రెండు సంపుటాలుగా వస్తుంది.' అంది రాజ్యం, సంతోషంగా.

మేము ఇంటర్ రెండవ సంవత్సరంలో ఉండగా రాజ్యం అతని రెండవ సంపుటాన్ని నాకు తెచ్చి యిచ్చింది. కుతూహలంగా చదివాను. నా కుతూహలం పెరిగింది. మళ్ళీ చదివాను. కౌమారదశలో అడుగుపెడ్తూ వున్న ఒక భావుకుని మనోగతావస్థ రకరకాలుగా చిత్ర విచిత్రంగా విన్యసీకరించబడిన తీరు అద్భుతం! ఆకాశంలో రంగులు. ఎగిరే పక్షులు. ఉదయసంధ్య వేళ ప్రకృతికన్య విలాస లాస్యాలు. రంగుల ప్రపంచపు ఉదాత్త స్వరూప చిత్రణలు. మార్మిక సంకేతాలు. బావుంది. చాలా బాగుంది.

ఆ మాటే చెప్పాను రాజ్యానికి. మర్నాడు - 'అన్నయ్య నీకు తన థాంక్సు చెప్పమన్నాడు' అని వచ్చి చెప్పింది. 'నేను చెప్పిందంతా అతనికి నీవు చెప్పావా?' అని అడిగాను. 'అవును అందులో తప్పేముంది? నీ అభిప్రాయం తెలుసుకుని అతను చాలా ఆనందించాడు' అంది రాజ్యం.

నేనూ రాజ్యం 'కాంపిటీటివ్ ఎగ్జామ్సు'కి కూర్చోవటానికి ఢిల్లీ వెళ్ళినపుడు రాజ్యం నాకు అతని మూడో పుస్తకాన్ని ఇచ్చింది. 'అన్నయ్య నీకు ఈ పుస్తకం ఇమ్మన్నాడు' అంది.

'ప్రియమయిన నళినికి అభిమానంతో—' అని రాసి ఆటోగ్రాఫ్ చేసి ఇచ్చాడు. నాకు సంతోషంగా అనిపించింది. ఆ పుస్తకమూ అద్భుతంగా ఉంది! నడకలో వూపు వుంది. భావనలో గొప్ప ఉదాత్తత. ఆ భాష అందమయిన 'పదాల పందిరి' అన్పించింది. యవ్వన ప్రాదుర్భావ దశలో ఉన్న ఒక కవి కుమారుడు, తన ప్రియురాలిని వస్తువుగా చేసుకుని అల్లిన శృంగార కర్పూర కవిత్వ కళిక. నా మనస్సు ఉక్కిరిబిక్కిరి అయింది. ఆలోచనలు జుంటి తేనియలను జుర్రిన భ్రమరముల లాగా నన్ను ముట్టడించాయి. అందమయిన అనుభూతి నన్ను ముప్పిరిగొన్నది. ఆ కవిత్వంలో సిన్సియారిటీ ఉంది, సీరియస్‌నెస్ ఉంది. పఠితను ఆలోచింపజేసే లక్షణం ఉంది. జిగీ, బిగీ, మెలీ పుష్కలంగా ఉన్నాయ్. ఉదాత్తమయిన 'ప్రేమయిక తత్త్వం' యొక్క గొప్పదనం నిబిడీకరింపబడి ఉంది. యవ్వన విలాస విన్యాసాల చిత్రణ ఉంది. అద్భుతమయిన చిత్ర విచిత్ర విభావరి! మళ్ళీ మళ్ళీ చదువుకుని ఆనందించాలన్న ఆశతో ఆ పుస్తకాన్ని జాగ్రత్తగా దాచుకున్నాను. ఆ పుస్తకం నన్ను ఎంతగా ప్రభావితం చేసిందంటే- నేను చదివిన అతని ఆ మూడు పుస్తకాలమీదా, 'రివ్యూ'లు రాశాను. ఆలిండియా సర్క్యులేషన్ గల ఒక పత్రికలో అవి ప్రముఖంగా ప్రచురింపబడినాయ్. రమేష్‌కేగాక, ఆ 'రివ్యూ'లు నాకూ ఎంతో పేరు ప్రఖ్యాతుల్ని తెచ్చిపెట్టినయ్.

కాని ఆ సమయానికి మా దార్లు విడిపోయేయ్. 'కాంపిటీటివ్ ఎగ్జామ్స్'లో సెలెక్టయి నేనూ రాజ్యం ఆఫీసర్లుగా దూరప్రదేశాల్లో కుదురుకున్నాము. నాకు థాంక్సు చెపుతూ రమేష్ రాసిన సుదీర్ఘమయిన ఉత్తరం రాజ్యంద్వారా నాకు అందింది. దానికి వెంటనే సమాధానం రాసాను. అంతే.

ఆ తర్వాత కొన్ని సంవత్సరాలు ఇట్టే గిర్రున తిరిగి పోయేయ్. ఈ జీవితాలు ఇంతేగదా!

నాగపూర్‌నుండి నన్ను మోసుకుని వచ్చిన ఎక్స్‌ప్రెస్ ట్రెయిను సికిందరాబాద్‌లో మెల్లగా ఆగుతూవున్న ఆ క్షణాలలో ఆ ఆలోచనలు నా మస్తిష్కాన్ని నింపాయ్. అనుభూతులు రాజ్యం చేసాయ్.

ప్లాట్‌ఫారం మీద నా గురించి ఎదురుచూస్తూ వుంది రాజ్యం. రాజ్యంలో పెద్ద మార్పు ఏం లేదు. ఇదివరకు ఎలా ఉందో ఇప్పుడూ దాదాపు అలాగే ఉంది. కారులో రాజ్యం ఇంటికి వెళ్ళాం. అంతులేని కబుర్లు. రాజ్యం భర్త సికింద్రాబాదులోనే రైల్వేలో ఆఫీసరుగా చేస్తున్నారుట! ఆయనా ఆదరంగా పలకరించారు. రాజ్యానికి ఇద్దరు పిల్లలు. ఒక బాబు. పాపా. ఇద్దరూ పబ్లిక్ స్కూల్లో, చదువుతున్నారు. వెన్నముద్దల్లాగా ముద్దు ముద్దుగా ఉన్నారు. మావారూ సెంట్రల్ గవర్నమెంట్‌లో క్లాస్ వన్ ఆఫీసరు - నాగపూర్‌లోనే జాబ్. మాకు ఇంకా పిల్లలు లేరు. ఇది నా సంగతి.

రాజ్యం వట్టి కబుర్ల పోగు. ఎన్నో విశేషాలు చెప్పింది. అంతా తన గురించీ, తన జాబ్ గురించీ, పిల్లల గురించీనూ. నేను ఉన్న ఆ నాలుగు రోజులూ సెలవుపెట్టి నన్ను తనే స్వయంగా తిప్పింది రాజ్యం. ఆప్యాయంగా అభిమానంగా నీడలాగ నావెంటే ఉంది. నేను హైదరాబాద్ వచ్చిన పని పూర్తయింది నాలుగు రోజులలో.

ఆ సాయంత్రమే నా నాగపూర్ ప్రయాణం. రిజర్వేషన్స్ అయ్యాయి. సమయం చకచకా గడిచిపోతూ ఉంది. నీళ్ళు పల్లానికి పారినట్లు జరజరా జారిపోతూ ఉంది టయిమ్.

రాజ్యంనుండి, అంతసేపూ నేను ఎదురుచూసిన ఆ 'విశేషాలు' వాటంతట అవి వచ్చే సూచనలే లేవు! అందుకే— నేనే అడిగేశాను. సమయం మించిపోతే అవకాశం చేయిజారిపోతుంది.

'రమేష్ పుస్తకాలు ఇంకేమీ రాలేదా?'

ఆ ప్రశ్నకి, రాజ్యం మొహం సడన్‌గా రంగు మారింది. 'వచ్చాయ్' అంది; తల వంచుకుని నేను నవ్వి - 'ఏవీ? నాకు 'చూపించనేలేదు.' అన్నాను. 'చూపించటానికి ఏముందీ?' లైబ్రరీ గది'లో అడుగు రాక్‌లో ఉన్నాయి. చూస్తూ ఉండు. ఇదుగో-నేను ఈ పని కాస్తా ముగించి వెంటనే వస్తాను.' అంది ర్యాజం. కుతూహలాన్ని ఆపుకోలేక నేనే వెళ్ళి ఆ పుస్తకాల రాక్ దగ్గరకి నడిచాను. దుమ్ము గొట్టుకుని ఉన్న ఎరరంగు అట్టగల ఆ పుస్తకాల్ని తీసాను. దుమ్ము దులిపి వాటిని

చదవటంలో మునిగిపోయాను, గతక్షణం. కుతూహలపుశక్తి అటువంటిది.

ఈ ప్రపంచ సమాజం, వ్యవస్థా, పద్ధతులలోని పాశ్వికత్వం, దౌర్జన్యం, దగా, కుట్ర, దోపిడీ, జానిసత్వం, అన్యాయం, మోసం, తిరుగుబాటూ, రక్తారుణిమలూ, దగాపడిన తమ్ముళ్ళూ - మొదలయిన సజ్జిట్టులమీద, కేకల్తో, బూతులతో, గర్జనలతో, అసభ్య పదజాలాలతో నిండిన - విరగగొట్టబడిన పంక్తులు! నగ్నంగా చెప్పబడిన ప్రపంచతత్వం. హింసను ప్రేరేపించటం ఎక్కువ! వాటిల్లో ఉద్దేశ్యం ఉంది. వాదన ఉంది. నిజాయితీ ఉంది. రెచ్చగొట్టటం ఉంది - లేనిదల్లా ఒక్కటే!

ఆ పుస్తకాల్ని తిరిగి రాక్‌లో యథాస్థానంలో ఉంచేసాను. చేతులు దులుపుకున్నాను.

నా వెనకాలనుండి నిట్టూర్పు వినవచ్చింది, సుదీర్ఘంగా. వెనక్కి తిరిగి చూసాను — అక్కడ రాజ్యం నిలబడి ఉంది. రాజ్యం మొహం వివర్ణమయిఉంది. రాజ్యం కళ్ళల్లో తడి! బాధ.

'ఎంతసేపయిందీ, వచ్చి?' అన్నాను; అది గమనించనట్లు - 'చాలాసేపయింది' అని, తల దించుకుని, వచ్చి నా ప్రక్కన కూర్చుంది, రాజ్యం. వ్యథ నిండిన నిశ్శబ్ద సంగీతం. తెగిన అనుభూతి తీగల ఆలాపన. మా ఇద్దరిమధ్యా గంభీర నిశ్శబ్దం! ఆ నిశ్శబ్దంలో ఎన్నో ఎన్నెన్నో ఊసులు.

'ఈ పుస్తకాల్ని నీకు చూపించకూడదనుకున్నాను. నువ్వే అడిగి, చూశావు' రాజ్యం అంది నిష్ఠురంగా. నిజమే. నేను చేసిన 'ఈ పని' వలన నా మనసులోని ఒక సుందర చిత్రపటం విధ్వంసమయింది. నా మనస్సు పాలలో ఉప్పురాయి వేసిన విధంగా అయింది. స్వయంకృతం!

'ఇప్పుడు రమేష్ ఏం చేస్తున్నాడు? ఎక్కడ ఉన్నాడు?' అన్నాను. నా గొంతు బరువుగా ఉంది. రాజ్యం నావంక రోషంగా చూసింది — 'ఇంకా నీకు తృప్తిగా లేదా?' అంది. చాలాసేపు మా ఇద్దరిమధ్యా మవునం రాజ్యం చేసింది. ఆ నిశ్శబ్దంలో ఎన్నో అగాథాలు! మరెన్నో సుడిగుండాలు!! చాలాసేపయాక చివరికి — 'రమేష్ అన్నీ వాదిలేసి, ఇప్పుడు అడవుల్లో తుపాకులు పేలుస్తున్నాడు' అంది రాజ్యం; నోరు పెగల్చుకుని - 'తను చేస్తున్న పనిలో రమేష్‌కి తృప్తి ఉంది. అంకితభావం ఉంది' అంది. ఆలోచనల తీరు తెన్నుల్లోని వైరుధ్యం వలననే మా ఇద్దరికీ ఆ వెలితి. కవిగా అతనికి ఇపుడు నేను గుర్తింపు ఇవ్వకపోవచ్చును. కాని వ్యక్తిగా రమేష్ సమాజాన్ని గురించి పెట్టుకున్న ధ్యేయానికీ, అతని ప్రయత్నానికీ నా అభినందన ఉంటుంది. ఈనాటి ఈ రమేష్ ఆనాటి మా రమేష్ కాదే! - అన్న ఆవేదనే రాజ్యమూ నేనూ - లోనయిన ప్రస్తుత స్థితికి కారణం! వర్గవైరుధ్యానికి మేము తలవంచటం, ప్రాకృతిక వైచిత్ర్యం!

అదీ రహస్యం

శ్రీ భాగవతుల సుబ్రహ్మణ్యం

నా కలం
త్రిశూలం.
ప్రతి మొనా
ఓ
ప్రక్రియ
కాలవాలం.

ప్రతిపోటూ
పిడుగుపాటు.
అయినా,
పిడి
ఒక్కటే!
పునాది
పాతదే!

అదే
సాంప్రదాయం
నా
సాహిత్య నిత్య
నూతనత్వ
రహస్యమదే!